## క్లుప్తంగా

### ముగిసిన విద్యార్థుల విజ్ఞాన యాత్ర



శ్రీహరి కోటను సందర్శించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

**పుట్టపర్తి:** శ్రీ సత్యసాయి జిల్లా విద్యార్థుల విజ్ఞాన యాత్ర విజయవంతంగా ముగిసింది. సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన సైన్స్ ప్రయోగాల్లో ప్రతిభ చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 120 మందిని ఈనెల 16 నుంచి రెండు రోజుల పాటు విజ్ఞాన యాత్రకు తీసుకెళ్లినట్లు జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్ శుక్రవారం తెలిపారు. విద్యార్థులతో పాటు 29 మంది ఉపాధ్యాయులు వెళ్లారన్నారు. వీరు శ్రీహరి కోట అంతరిక్ష కేంద్రం, అగస్త్య ఫౌండేషన్, కుప్పం తదితర ప్రాంతాల్లో పర్యటించారన్నారు. ప్రధానంగా శ్రీహరి కోట అంతరిక్ష కేంద్రంలో రాకెట్లు, కంట్రోల్ సెంటర్, రెండు లాంచింగ్ కేంద్రాలు, రాడార్ కేంద్రాలను విద్యార్థులు ప్రత్యక్షంగా చూడటడంతోపాటు వాటి గురించి అక్కడి సిబ్బందితో వివరాలు తెలుసుకున్నారన్నారు. ఇలాంటి యాత్రలు విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంచడంతోపాటు విజ్ఞానాన్ని అందిస్తాయని తనూజ్ కుమార్ తెలియజేశారు.

### వైభవంగా సల్లాపురమ్మ గ్రామోత్సవం



సల్లాపురమ్మను పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

**పుట్టపర్తి అర్బన్:** పెడపల్లిలో శుక్రవారం సల్లాపురమ్మ గ్రామోత్సవం వైభవంగా సాగింది. మూడు రోజుల జాతరలో భాగంగా తొలిరోజు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీపై ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈసందర్భంగా భక్తులు ప్రతి ఇంటి వద్ద కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో భాగంగా ఆదివారం బోనాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

**నల్లమాడ:** మండలంలోని ఎన్. బడవాండ్లపల్లి శివారు ప్రాంతంలో శుక్రవారం పేకాట స్థావరంపై దాడిచేసి ఆరుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు సీఐ నరేంద్రరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వారినుంచి రూ.51,520 నగదు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పేకాట జరుగుతున్నట్లు అందిన పక్కా సమాచారంతో తమ సిబ్బందితో కలిసి దాడి చేశామని తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో అంజన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, హరిబాబు, విష్ణు, నరసింహారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి ఉన్నారన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


### అవొపా అధ్యక్షుడిగా సుజన్‌కుమార్



సుజన్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**ధర్మవరం అర్బన్:** ధర్మవరం అవొపా అధ్యక్షుడిగా ఇనుగూరు సుజన్‌కుమార్ ఎన్నికయ్యారు. పట్టణంలోని విజయలక్ష్మి ఆయుర్వేదిక్ క్లినిక్‌లో శుక్రవారం అవొపా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అవొపా అధ్యక్షుడిగా ఇనుగూరు సుజన్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిని జిల్లా ఇన్‌చార్జ్ అన్నా లక్ష్మీనారాయణ, ధర్మవరం యూనిట్ ప్రెసిడెంట్ శీభా నగేష్‌గుప్తా, కాకుమాని శ్రీహరి, ఓవీ ప్రసాద్, అకౌంటెంట్ ప్రసాద్, ఫార్మసిస్ట్ భాస్కర్, హేమంత్‌కుమార్, వేణుగోపాల్, సుకుమార్ తదితరులు శాలువాలతో సన్మానించారు.

### ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక



ఎమ్మార్పీఎస్ మండల కమిటీ

**ఓడీచెరువు:** ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు పలక ఆంజనేయులు అధ్యక్షతన మండలకేంద్రంలో శుక్రవారం మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. మండలాధ్యక్షుడిగా అచ్చుక్కగారి రామాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా బడిశం అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మడకశిర రామాంజినేయులు, కోశాధికారిగా కొత్త మారెప్పను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్, సీనియర్ నాయకులు ఎర్ర దొడ్డప్ప, అంజనప్ప, శ్రీనివాసులు, రామకృష్ణ, పలక గంగన్న, అక్కులప్ప, బావన్న, ఎంఈఎఫ్ నాయకులు నర్సింహులు, రామాంజి, కత్తి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు

# త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే



సీఎన్ కోటలో శిలువతో ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు



వెంగళమ్మచెరువులో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

**బత్తలపల్లి:** త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రై డే అని పాస్టర్లు తెలియజేశారు. మండల కేంద్రంతోపాటు గుమ్మళ్ళకుంట, తంబాపురం, సంగాల, నెత్తివారంపల్లి, ముష్టూరు, సంజీవపురం, మాల్యవంతం తదితర గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంలోని క్రీస్తు ఆరాధన మందిరంలో పాల్‌రాజన్, ఎల్ఈఎఫ్ చర్చిలో సీహెచ్.పాల్, బెలివరో చర్చిలో విటి.సుదర్శన్, భక్తిసింగ్ సంఘం చర్చిలో ప్రభాకర్, రక్షణ సంఘం చర్చిలో శాంతరాజ్, రివైవల్ చర్చిలో రూపాసు హాసిని పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఆర్డీటీ ఆసుపత్రిలో గుడ్‌ఫ్రైడే జరుపుకున్నారు.

**తాడిమర్రి:** గుడ్ ఫ్రై డే సందర్భంగా తాడిమర్రి, పిన్నదరి, నిడిగల్లు, నార్శింపల్లి, మరవపల్లి, ఎం.అగ్రహారం, చిల్లకొండయ్యపల్లి, దాడితోట తదితర గ్రామాల్లోని చర్చిల్లో శుక్రవారం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల కేంద్రంలో హెబ్రోన్ చర్చి పాస్టర్ ఆధ్వర్యంలో క్రైస్తవులు తాడిమర్రి ప్రధాన వీధుల్లో ప్రార్థనలు చేస్తూ ర్యాలీ చేశారు. అలాగే ఈసీఐ చర్చిలో ఫాదర్ విజయ్ కుమార్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

**కనగానపల్లి:** మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం క్రైస్తవులు గుడ్ ఫ్రూ డేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సీఎన్ కోట గ్రామంలో ఏసు శిలువ మోస్తూ ఊరేగించారు. అనంతరం స్థానిక క్యాథలిక్ చర్చిలో ఫాదర్ తంబి ఆధ్వర్యంలో సామూహిక ప్రార్థనలు చేశారు. తగరకుంట, మామిళ్లపల్లి, కనగానపల్లి గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు సామూహిక ప్రార్థనలు చేసి ఏసు ప్రభువు గీతాలను ఆలపించారు.

**పుట్టపర్తి అర్బన్:** వెంగళమ్మచెరువు గ్రామంలో క్రైస్తవులు హోలీసిటీ చర్చిలో గుడ్ ఫ్రైడే జరుపుకున్నారు. ప్రత్యేకంగా 7 వార్డులకు చెందిన ఏడుగురు ప్రేయర్లు బైబిల్‌ను చదివి వినిపించారు. కార్యక్రమంలో పాస్టర్ మైఖేల్, సిస్టర్ కీర్తన, కిశోర్, రోడిరాజు, మధుబాబు, సుందర్‌రాజ్‌కుమార్, రకడ రాజు, సుసన్న మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని పలు చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే నిర్వహించారు. మార్కెట్‌వీధిలోని సీఎస్ఐ చర్చి, రైల్వేక్వార్టర్స్‌లోని ఆంధ్రా చర్చి, లక్ష్మిచెన్నకేశవపురంలోని హోలిలైట్ చర్చి, రాజేంద్రనగర్‌లోని చర్చి, దుర్గానగర్‌లోని ఎల్ఇఎఫ్ చర్చి, నెహ్రూనగర్‌లోని షాలేము ప్రార్థన మందిరం, జోగోనికుంటలోని షిలోహు ఆరాధన మందిరం, పీఆర్‌టీవీధిలోని చర్చి, కొత్తపేటలోని చర్చి, లక్ష్మీనగర్‌లోని బేతేలు బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



ధర్మవరంలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు




బత్తలపల్లిలోని క్రీస్తు ఆరాధన మందిరంలో సందేశం వినిపిస్తున్న పాస్టర్ పాల్‌రాజన్

**పుట్టపర్తి టౌన్:** గుడ్ ఫ్రైడే సందర్భంగా స్థానిక కర్ణాటకనాగేపల్లిలోని హోలీసిటీ చర్చి, కింగ్స్ చర్చిలో పాస్టర్ అరుణ్‌కుమార్, బీడుపల్లి, ప్రశాంతి గ్రాంలో ఉన్న షాలోమిషన్ చర్చిలో పాస్టర్ రాజారత్నం ఆధ్వర్యంలో ఉదయం క్రైస్తవులు ప్రార్థనలు చేపట్టారు.

### శిల్ప గురు పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం



పద్మశ్రీ దళవాయి చలపతికి దరఖాస్తు ఇస్తున్న లేపాక్షి ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య

**అనంతపురం కల్చరల్:** జాతీయ, శిల్ప గురు పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని తోలు బొమ్మల తయారీలో నిష్ణాతులైన హస్తకళాకారులకు లేపాక్షి ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య సూచించారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను ఉమ్మడి అనంత జిల్లాలోని హస్తకళాకారులకు శుక్రవారం లేపాక్షి ఎంపోరియంలో ఆయన అందజేసి, మాట్లాడారు. ఏపీ లేపాక్షి కళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిష్ణాతులైన కళాకారులకు జాతీయ, శిల్పగురు అవార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. ఇందు భాగంగా 'ఒన్ డిస్ట్రిక్ట్ ఒన్ క్రాఫ్ట్' పరిధిలో జిల్లాలో కేవలం తోలుబొమ్మల తయారీ కళాకారులకు మాత్రమే పురస్కారాన్ని అందుకునే అవకాశం ఉందన్నారు. అవార్డుకు ఎంపికైన వారికి వారి అర్హత, నైపుణ్యం బట్టి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు నగదు పురస్కారాన్ని అందజేస్తారన్నారు. మే 5వ తేదీ లోపు దరఖాస్తులను అందజేయాలన్నారు. ఇన్‌చార్జి అమరనాథ్ పాల్గొన్నారు.

# వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలి



బత్తలపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

**బత్తలపల్లి:** వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలని ముస్లింలు డిమాండ్ చేశారు. శుక్రవారం సంయుక్త మసీదు కమిటీ ఆధ్వర్యంలో బత్తలపల్లిలో వందలాది మంది ముస్లింలు నల్ల రిబ్బన్లు ధరించి నల్ల జెండాలు, జాతీయ జెండా చేతబట్టి జామియా మసీదు నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బత్తలపల్లిలోని నాలుగు రోడ్ల కూడలికి చేరుకుని మానవహారంగా నిల్చున్నారు. రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు తెలిపిన టీడీపీ, జనసేన పార్టీలకు గుణపాఠం చెప్పితీరుతామని పలువురు ముస్లిం నేతలు అన్నారు. మానవహారం అనంతరం వారు మాట్లాడుతూ.. ముస్లింల హక్కులను కాలరాసేలా బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టిందని మండిపడ్డారు. ముస్లిం ఓట్లతో గద్దెనెక్కిన పార్టీలు కూడా కేంద్ర ప్రభుత్వానికి మద్దతు తెలపడం విచారకరమన్నారు. రూ.కోట్ల విలువైన వక్ఫ్ బోర్డు పరిధిలోని ఆస్తులను తరతరాలుగా కాపాడుకుంటూ వస్తున్నామని, ఏనాడు ఆ ఆస్తులను విక్రయించలేదన్నారు. వక్ఫ్ పరిధిలోని ఆస్తులతో మసీదులు, మదర్సాల నిర్మాణం, ముతవల్లి ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

**బిల్లు ఉపసంహరించుకోకపోతే దేశవ్యాప్త ఉద్యమం**

ముస్లింల నిరసన ర్యాలీకి మద్దతు ప్రకటించిన సీపీఐ(ఎంఎల్) నాయకులు ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ నాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ... ముస్లింల ఓట్లతో గద్దెనెక్కిన ప్రభుత్వాలు వారికే తీవ్ర అన్యాయం చేస్తున్నాయన్నారు. ముస్లింల ప్రయోజనాలకు నష్టం కలిగించే వక్ఫ్ చట్ట సవరణకు మద్దతు ప్రకటించిన పార్టీలకు రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ నాయకులు మైనార్టీలపై దాడులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ముస్లింలతో పాటు క్రిస్టియన్లపై కూడా పెత్తనం సాగిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణను ఉపసంహరించుకోకపోతే దేశవ్యాప్తంగా ముస్లింల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. వైస్ ముతవల్లి ఇస్మాయిల్, కార్యదర్శి ఎల్ఎస్ సుబహాన్, మదీనా మౌలా, మాజీ ముతవల్లి కరీంసాబ్, నడిమింటి షేక్షావలి, అంజన్‌రెడ్డి మౌలా, సత్తార్‌సాబ్, జిలాన్‌సాబ్, ముస్తఫా, మక్బూల్, ప్లాట్ల జిక్రియా, ప్లాట్ల కాలా మహబూబ్‌బాషా, షాషు, బాబ్‌జాన్, టైలర్ బాబా, ఎలక్ట్రికల్ బాషా, టైలర్ రియాజ్, చికెన్ దాదా, మున్నా తదితరులు పాల్గొన్నారు.

# విపత్తుల వేళ అప్రమత్తంగా ఉండాలి



ధర్మవరం పెట్రోల్ బంకులో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



కొత్తచెరువులో అగ్నిమాపక సిబ్బంది విన్యాసం

**పుట్టపర్తి టౌన్:** అగ్ని విపత్తుల సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా అగ్ని మాపక శాఖ అధికారి నాగరాజునాయక్ పేర్కొన్నారు. అగ్ని ప్రమాదాల నివారణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కొత్తచెరువు ప్రధాన కూడలి వద్ద అగ్నిమాపక సిబ్బంది విన్యాసాలు ప్రదర్శించారు. అనంతరం పెట్రోల్ బంకు వద్ద గ్యాస్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

**కదిరి టౌన్:** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మున్సిపల్ పరిధిలోని సిద్ధార్థ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం, అనంతపురం రోడ్డులోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద క్రవారం అగ్ని ప్రమాదాలపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ అగ్నిమాపక శాఖ అధికారి శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

**ధర్మవరం అర్బన్:** అగ్ని ప్రమాదాలు జరగకుండా పెట్రోల్ బంకుల్లో జాగ్రత్తలు పాటించాలని అగ్నిమాపక అధికారి రాజు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని పలు పెట్రోల్ బంకుల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటలు ఎలా అదుపు చేయాలని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

# సోలార్‌కు భూములు ఇస్తే వలసలు తప్పవు



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు.

**ఎన్పీకుంట:** సోలార్ ప్రాజెక్టుకు భూములు ఇస్తే రైతులకు వలసలు తప్పవని ఏపీ రైతు సంఘం నాయకులు ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జౌకల గ్రామంలో శుక్రవారం పవర్ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయే రైతులు, గ్రామస్తులతో రైతు సంఘం నాయకులు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోలార్ ప్రాజెక్టుతో రైతులకు, నిరుద్యోగ యువతకు కానీ ఎటువంటి ఉపయోగం లేదన్నారు. వ్యవసాయం, పశువుల మేతకు భూమి కూడా ఉండదని తెలిపారు. రైతులు మాట్లాడుతూ తమ తాతల కాలం నుంచి భూములను సాగుకు అనుకూలంగా మార్చుకొని వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నామని, ఇటువంటి సాగు చేసుకుంటున్న భూములను సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం అన్యాయంగా తీసుకోవడం దారుణమన్నారు. తమ భూములకు హద్దులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని తెలిపారు. మండలం చుట్టూ సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటైతే రైతులు ఎలా బతకాలని ప్రశ్నించారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వమే నట్టేట ముంచుతోందని, రైతుల భూములను కార్పొరేట్ వ్యవస్థలకు అప్పచెప్పుతోందని ఆరోపించారు. రైతులకు ఏపీ రైతు సంఘం అండగా ఉంటుందని, రైతుల పక్షాన పోరాటాలు ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి, నాయకులు జంగాలపల్లి పెద్దన్న, రామకృష్ణ, శంకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగిరెడ్డి, గంగిరెడ్డి, నాగరాజు, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### పంట ఎండిపోయింది.. న్యాయం చేయండి

**కదిరి అర్బన్:** పురుగు మందుల దుకాణం వ్యక్తి ఇచ్చిన మందు కొట్టడంతో పంటతో ఎండిపోయిందని, తనకు న్యాయం చేయాలని కాళసముద్రం గ్రామానికి చెందిన రైతు ఖాసీం అధికారులను కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత నెల 31న కదిరిలోని సంకల్ప అనే పురుగుల మందు దుకాణంలో మందు తీసుకుని అరెకరంలో మొక్కజొన్న పంటకు కొట్టడంతో పంట ఎండిపోయిందన్నారు. విషయాన్ని దుకాణదారుడికి తెలియజేయడంతో అతడే స్వయంగా వచ్చి మరో అరెకరంలో డెమోగా మందు కొట్టి వెళ్లాడని, పంట దెబ్బతింటే తనదే బాధ్యతని చెప్పాడన్నారు. తర్వాత పంట ఎండిపోయిన విషయం చెప్పగా మళ్లీ నీళ్లు కొడితే పైరు బతుకుతుందని మిన్నకుండిపోయాడన్నారు. దీనిపై ఈనెల 9న రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌తోపాటు ఏఓకు ఫిర్యాదు చేశానని, తనకు న్యాయం చేయాలని కోరారు.

### ముగ్గురిపై కేసు నమోదు

**గాండ్లపెంట:** స్థలం విషయంలో మోసం చేసిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. తూపల్లి గ్రామానికి చెందిన అమ్మాజీకి తిరుపతిలోని తిరుచానూరు వద్ద 70 సెంట్ల స్థలం ఉందంటూ కదిరికి చెందిన సాయి, నవీన్‌కుమార్‌రెడ్డి, ఇందిరమ్మ అనే వారు రూ.46 లక్షలు తీసుకుని పత్రాలు ఇచ్చారు. తర్వాత అమ్మాజీ స్థలం విషయం ఆరా తీయగా అవి తప్పుడు పత్రాలుగా తేలింది. దీంతో శుక్రవారం ఆమె తనకు రూ.46 లక్షలు ఇప్పించాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెచ్‌సీ గంగాధర తెలిపారు.

### నాటుసారా స్థావరాలపై దాడులు

**కదిరి అర్బన్:** మరువతండా సమీపంలో గుట్టల్లో శుక్రవారం నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు నిర్వహించారు. ఈసందర్భంగా 150 లీటర్ల నాటుసారా ధ్వంసం చేశారు. దాడుల్లో ఎస్ఐలు శ్రీధర్, దత్తాత్రేయ, ప్రకాష్, నరసింహులు, రెవెన్యూ సిబ్బంది చంద్ర, నాగభూషణ పాల్గొన్నారు.

### ఘనంగా గంగమ్మ జాతర



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న దృశ్యం

**పుట్టపర్తి టౌన్:** బుక్కపట్నం మండలం జానకంపల్లిలో గంగమ్మ, మల్యాలమ్మ జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బుక్కపట్నం సమీపంలోని అక్కమ్మ గార్ల బావి వద్ద జాతర ప్రారంభమైంది. పూజారి దివాకర్ కుటుంబ సభ్యులు యలవగంప ఎత్తుకొని 108 మంది బాలికలు మహిళలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి గంగతో నింపిన మట్టి కలశాలతో పుటికిరెడ్డిపల్లి వరకు ఊరేగింపుగా తీసుకొచ్చి గంగమ్మతల్లికి అభిషేకం చేశారు. అనంతరం హోమం నిర్వహించారు. అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు పురవీధుల్లో ఊరేగించారు.

### 12 గంటలపాటు ప్రదక్షిణ



శ్రీనివాసులును సత్కరించిన ఆలయ కమిటీ

**ఎన్పీకుంట:** గూటిబైలు గ్రామంలో వెలసిన తిమ్మమాంబ ఆలయం వద్ద ధర్మవరానికి చెందిన చింతకాయల శ్రీనివాసులు 12 గంటలపాటు ప్రదక్షిణ చేశారు. ఉదయం 5 గంటలకు మొదలుపెట్టి సాయంత్రం 5 గంటలకు ప్రదక్షిణ ముగించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అతడిని సన్మానించారు. స్థానిక సర్పంచ్ విష్ణుమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, వెంకటనారాయణ, మనోహర్ తదితరులు ఉన్నారు.

### పంట నష్టపరిహారం ఇవ్వాలని ధర్నా

**తాడిమర్రి:** పంట నష్టపరిహారం ఇవ్వాలని మండలంలోని దాడితోట గ్రామానికి చెందిన రైతులు అదానీ గ్రీన్ ఎనర్జీ కంపెనీ కార్యాలయం ఎదుట శుక్రవారం ఉదయం ధర్నా చేపట్టారు. కొండపై అదానీ కంపెనీ చేపట్టిన పనులతో తమ పంటలు నష్టపోయామని వెంటనే పరిహారం అందించాలని రైతు పెద్ద సుబ్బారెడ్డి, ఆయన మరదలు లక్ష్మీదేవి తదితరులు డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కృష్ణవేణి సిబ్బందితో అక్కడికి వెళ్లి సమస్యను తహసీల్దార్‌కు తెలియజేయాలని ఇలా ధర్నా చేయడం సరికాదని వారికి సర్ది చెప్పారు. దీంతో వారు ఆందోళన విరమించారు.

### హౌసింగ్ ఏఈ అదృశ్యం

**కదిరి అర్బన్:** ముదిగుబ్బ ఏఈ సుదర్శన్‌యాదవ్ అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు..సుదర్శన్‌యాదవ్ కదిరి పట్టణంలోని అడపాల వీధిలో నివాసముంటున్నాడు. గురువారం రాత్రి తన భార్య చంద్రకళతో గొడవపడ్డాడు. అనంతరం కదిరి మండలం పాలబావి వద్ద తన బైక్, మొబైల్ ఫోన్ వదిలేసి వెళ్తున్నట్లు భార్యకు ఫోన్ చేసి చెప్పి వెళ్లిపోయాడు. అనంతరం కుటుంబసభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ప్రయోజనం లేకపోయింది. శుక్రవారం ఏఈ భార్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ పోలీసులు తెలిపారు.

### వర్గీకరణపై ఆర్డినెన్స్ హర్షణీయం

**కదిరి అర్బన్:** ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడం హర్షణీయమని ఎంఈఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం వారు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ నేత ఆనంద్, జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్, నాయకులు జయరాం, శ్రీనివాసులు, చిన్నప్పయ్య, నాగప్ప, ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

### ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి



పోస్టర్ విడుదల చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు, నాయకులు

**పుట్టపర్తి టౌన్:** వచ్చే నెల 4న విజయవాడలో జరిగే అఖిల భారత పోస్టల్ గిరిజన ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కన్వీనర్ రామానాయక్ కోరారు. శుక్రవారం పుట్టపర్తిలో డివిజనల్ పోస్టల్ కార్యాయలంలో సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మేళనంలో గిరిజన ఉద్యోగులు సమస్యలపై చర్చిస్తామన్నారు. సంఘం కోకన్వీనర్ గోపీరావ్, హిందూపురం డివిజన్ కార్యాదర్శి రామాంజనేయులు, శ్రీనివాసులు, పుట్టపర్తి అసిస్టెంట్ సూపరింటెండెంట్ కళ్యాణ్‌రామ్, పోస్టల్ ఉద్యోగి అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న కోలా వెంకటరమణ

**కదిరి టౌన్:** ఔత్సాహిక దళిత పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని దళిత ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(డిక్కీ)రాయలసీమ జోనల్ ప్రెసిడెంట్ కోలా వెంకటరమణ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గురువారం సాయంత్రం తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతూ 16వ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ అరవింద్ పనగరియాను వినతిపత్రం అందజేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న క్రెడిట్ లింక్ ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీని 25 శాతం నుంచి 45 శాతానికి పెంచాలన్నారు. వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక గ్రాంట్ ఇస్తున్న తరహాలోనే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రత్యేక పారిశ్రామిక రాయితీలు ఇవ్వాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో దళిత వర్గాలను నిష్ణాతులుగా తయారు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రొక్యూర్మెంట్ పాలసీలో ఎస్సీ ఎస్టీ వర్గాలకు ఇచ్చిన 5 శాతం రిజర్వేషన్‌ను కచ్చితంగా అమలు చేయాలన్నారు. క్రెడిట్ గ్యారెంటీ పథకాన్ని అమలులో వాణిజ్య బ్యాంకులు నిరాదరణ చూపుతున్నాయని, దాన్ని సక్రమంగా అమలు జరిపి మొదటి తరం దళిత పారిశ్రామిక వేత్తలకు ఆర్థిక భరోసా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

### అమరాపురంలో చోరీ

**అమరాపురం:** మండల కేంద్రమైన అమరాపురంలోని శిర రోడ్డులో నివాసం ఉంటున్న శివన్న ఇంట్లో చోరీ జరిగింది. గురువారం సాయంత్రం శివన్న రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో అతన్ని ఆస్పత్రికి తీసుకెళ్లారు. క్షతగాత్రుడి భార్య జయలక్ష్మి కూడా పుట్టింటికి వెళ్లింది. దీన్ని గమనించిన దుండగులు గురువారం రాత్రి తలుపులు పగలగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువా తాళాలను పగులగొట్టి అందులో ఉన్న రూ.లక్ష నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు జయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

### వెండి వస్తువుల అపహరణ

**పెనుకొండ:** పట్టణంలోని నారాయణమ్మ కాలనీ సమీపంలో నివాసముంటున్న ఉపాధ్యాయుడు చంద్రమౌళి ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. చంద్రమౌళి సొంత గ్రామం వెంకటగిరిపాళ్యంకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇదే అదునుగా భావించిన దొంగలు తలుపులు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న వెండి వస్తువులను అపహరించినట్లు బాధితుడు తెలిపారు. పై అంతస్తులో బాడుగకు ఉన్న వారు చెప్పడంతో ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగిన విషయం బయట పడిందన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చంద్రమౌళి తెలిపారు.